క్లుప్తంగా

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం దుర్గానగర్‌లోని దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, పూలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు పి.వెంకటరమణ, వై.వెంకటరావు, సానబోయిన సంపత్‌కుమార్, పల్లా పెంటారావు తదితరులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చెత్త పన్ను తగ్గించాలని వినతి



బెహరా భాస్కరరావుకు శాలువా కప్పి సత్కరిస్తున్న ఎస్సీ, బీసీ కాలనీవాసులు

గోపాలపట్నం: చెత్త పన్ను తగ్గించాలని కోరుతూ జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుకు 92వ వార్డు ఎస్సీ బీసీ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గోపాలపట్నంలో బెహరా నివాసం వద్ద మర్యాద పూర్వకరంగా కలిసి విన్నవించుకున్నారు. కాలనీవాసి కంపర కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ కాలనీ అభివృద్ధి చెందిన ప్రాంతంగా గుర్తించి రూ.120 వసూలు చేస్తున్నారని తెలిపారు. అయితే ఇక్కడ నివసించే వారంతా పేదలేనని వివరించారు. దీన్ని రూ.60కు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు గేదెల మురళీకృష్ణ, ఎద్దు దేవుళ్లు, మల్లేటి భీమయ్య పాల్గొన్నారు.

పేదలకు వితరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రఘురామరాజు, లక్ష్మణరావు

మల్కాపురం: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా శుక్రవారం 61వ వార్డు ఆర్‌కే పురంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పేదలకు అల్పాహారం, దుస్తులు పంపిణీ చేశారు. టీఎస్‌టీయూసీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథి రాష్ట్ర టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సేవా కార్యక్రమం నిర్వహించారు. గడిచిన రెండేళ్లలో టీఎస్‌టీయూసీ కార్మిక సమస్యలపై చేపట్టిన పోరాటాలు, నిరుద్యోగ యువతకు కల్పించిన ఉపాధి అంశాలపై ముద్రించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. షిప్‌యార్డ్ టీఎస్‌టీయూసీ నాయకుడు మాడిసి రమణ మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం లక్ష రూపాయల విరాళాన్ని నగరంలోని లలితానగర్‌కి చెందిన వారణాసి ప్రమీల శ్రీనివాస్ అనే దాత అందజేశారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై మే ఐహెల్ప్ యు కేంద్రంలో పీఆర్‌వో నాయుడికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు నాయుడు బాండ్ అందజేశారు.

అదుపులోకి వచ్చిన మంటలు

- 19 గంటల పాటు 5 అగ్నిమాపక శకటాల సేవలు
- పక్కనున్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు
- పొగ కారణంగా సాయంత్రం వరకు లోపలికి వెళ్ల లేని పరిస్థితి



జీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో వస్త్ర దుకాణం వద్ద పరిస్థితి



శుక్రవారం మధ్యాహ్నం మంటలను అదుపు చేస్తున్న ఫైర్ అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో యువరాణి వస్త్ర దుకాణంలో చెలరేగిన మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. గురువారం రాత్రి 11 గంటలకు మంటల్ని గుర్తించిన స్థానికులు గోపాలపట్నం పోలీసులకు 11.05 గంటలకు సమాచారమందించారు. ఆ తరువాత అగ్నిమాపక సిబ్బందికి 11.15 గంటలకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన అధికారులు 11.30 గంటలకు మంటల్ని అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు శుక్రవారం సాయంత్రం వరకు కూడా కొనసాగాయి. పూర్తిగా మంటలు అదుపులోకి వచ్చినా పొగ మాత్రం వస్తూనే ఉంది. పక్కనున్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ప్రమాదంలో కోట్ల నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మూడు అంతస్తుల్లో ఉన్న వస్త్రాలు, ఫర్నిచర్ విలువైన పరికరాలు అన్నీ కాలిబూడిదయ్యాయి. వస్త్ర దుకాణం ఉద్యోగి ఎస్.రామ్మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గోపాలపట్నం సీఐ ఈదుల నరసింహారావు కేసు నమోదు చేశారు. అగ్నిమాపక అధికారులు కూడా ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల లేక మరే ఇతర కారణాల వల్ల జరిగిందో ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు.

గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పూర్తి స్థాయిలో మంటలు అదుపులోకి రాకపోవడంతో నష్టాన్ని అంచనా వేయలేకపోతున్నామని తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ సురేష్‌కుమార్, వీఆర్వో సుబ్రహ్మణ్యం, సచివాలయం కార్యదర్శులు ఉన్నారు. సుమారు 19 గంటల పాటు నగరంలోని ఐదు అగ్నిమాపక శకటాలతో సిబ్బంది నిరంతరాయంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ఏడీఎఫ్‌వో సుబ్బారావు స్వయంగా మంటలు ఆర్పే చర్యలను పర్యవేక్షించారు.

పక్కి దివాకర్ కుటుంబానికి పరామర్శ



పక్కి దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కోలా గురువులు

కంచరపాలెం: ఇటీవల మరణించిన రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పక్కి దివాకర్ కుటుంబ సభ్యులను మర్రిపాలెంలోని స్వగృహంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు పరామర్శించారు. దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి, బీసీ అధ్యయన కమిటీకి దివాకర్ చేసిన సేవలను గుర్తు చేశారు. అందరితో కలిసికట్టుగా ఉంటూ అనేక సేవలందించిన దివాకర్‌ను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోటాన రాము, రామన్న పాత్రుడు, సత్యాల సాగరిక, సత్యాల వెంకట్, అప్పారావు, బొండాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు తక్షణం చెల్లించండి



నిరసన తెలుపుతున్న షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగులు

మల్కాపురం: తమకు రావాల్సిన బకాయిలను తక్షణం చెల్లించాలని హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై వారు మల్కాపురం గ్రామ మండలి వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ 2020–21 ఆర్థిక సంవత్సరానికి గానూ తమకు షిప్‌యార్డ్ యాజమాన్యం సెలవు వేతనం చెల్లించాల్సి ఉందన్నారు. 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో రిటైరైన వారికి సెలవుల వేతనాలు యాజమాన్యం చెల్లించాల్సి ఉందని వివరించారు. దీనిపై సంస్థ యాజమాన్యంతో మాట్లాడి, వినతిపత్రం అందించనున్నట్టు తెలిపారు. ప్రతినిధులు బి.సత్యానందరావు, బి.ఆర్.బుగ్గారెడ్డి, బి.వి.ఎస్.పాత్రో, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8న వాహనాల వేలం

గోపాలపట్నం: వివిధ తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వచ్చే నెల 8న వేలం వేస్తామని ఇన్‌చార్జ్ ఉప రవాణా కమిషనర్ వి.జయప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల మేరకు అపరాధ రుసుం, పన్నులు చెల్లించని వాహనాలు, వదిలేసిన వాహనాలు, వాహన యజమానుల నుంచి స్పందన లేకుండా వదిలేసినా వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. వాహనదారులు జరిమానాలు చెల్లించి తీసుకుపోవాలన్నారు. లేకపోతే వేలం తప్పదని హెచ్చరించారు. ఆర్‌టీఏ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో వివరాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల వారు ధరావత్తు రూ.10,000 వేలు చెల్లించాలని చెప్పారు. సీజ్ చేసిన వాహనాలు మద్దిలపాలెం, వాల్తేర్, సింహాచలం ఆర్టీసీ డిపోల్లో ఉన్నాయన్నారు. 8వ తేదీ సాయంత్రం 4 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సాయి సత్య వ్రతం



పంచామృతాభిషేక సేవలో సాయినాథుడు



సామూహిక సాయి సత్య వ్రతంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణా నగర్‌లోని షిర్డీసాయి ధ్యాన మందిర 14వ వార్షిక మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయి నాథుడికి పంచామృతాభిషేకాలు, విభూదితో అభిషేకం, మండప ఆవాహన పూజలు, షిర్డీ సాయి మూలమంత్ర జప హోమం, పూర్ణాహుతి జరిపారు. అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ, కాగడా హారతి ఇచ్చారు. సాయంత్రం సామూహిక సాయి సత్య వ్రతం నిర్వహించారు. 300 మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. పూజా సామగ్రిని ఆలయ కమిటీ ఉచితంగా అందజేసింది. శనివారం ఉదయం 1008 లడ్డూలతో సాయిబాబాకు అభిషేకం, మధ్యాహ్నం ఆలయం వద్ద 3 వేల మందికి మహా అన్నదానం, సాయంత్రం పురవీధుల్లో పల్లకీ సేవ ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేటి కిరణ్‌కుమార్ తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షులు తోటపల్లి శ్రీనివాస్, ప్రగడ జగన్నాథరావు, కార్యదర్శి పోలిపల్లి సూర్యారావు, కోశాధికారి తోటపల్లి వెంకట సూర్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న దువ్వూరి శృతి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరీ ఆహుతులను అలరించింది. ద్వారం త్యాగరాజు శిష్యురాలు దువ్వూరి శృతి పలు కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. వాలాజి వరణం, శ్రీ గణేశ్వర, జననీనిను విన, నూదు మహిమ, అనుపమ గుణాంబుధి, లలితే భైరవి, శ్రీచక్రరాజ, రేవతి తిల్లాన కీర్తనలు భక్తులను పరవశింపజేశాయి. ఈమెకు కోటా గాయత్రి వరేణ్య వయోలిన్‌పై, తాలాడ చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని శృతిని అభినందించి సత్కరించారు.

ఘనంగా గోరింటాకు వేడుక

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోరింటాకు వేడుక ఘనంగా నిర్వహించారు. ముందుగా వైభవుడికి, అనంతరం శ్రీదేవి, భూదేవిలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవార్లకు, వనితలకు గోరింటాకు వేడుక నిర్వహించారు. భక్తులు పాల్గొని వేడుకను తిలకించారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల ఏర్పాట్లను ఆలయం ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షించారు.

ఎన్‌ఎస్‌టీఎల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

గోపాలపట్నం: జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల, కళాశాలల పరిధి 9, 10 తరగతులు, ఇంటర్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎన్‌ఎస్టీఎల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. మే నెల 9, 10 తేదీల్లో ఉత్పత్తులు, మల్టీమీడియా ప్రదర్శన ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎప్రోచ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టయిన్‌బుల్ ఫ్యూచర్ అనే అంశంపై నమూనాల పోటీ జరుగుతుందని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ప్రదర్శించనున్న నమూనాల వివరాలను ఆయా స్కూళ్లు, కాలేజీల ప్రిన్సిపాళ్లు మే 3లోగా సంస్థకు పంపించాలని సూచించారు. వివరాలకు 94902 32433, 93963 67120, 85390 88872 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన నమూనాలను 9, 10 తేదీల్లో జరిగే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామని అధికారులు తెలిపారు.

వేడుకగా మౌంట్ డియోస్ స్కూల్ కల్చరల్ ఫెస్ట్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

దొండపర్తి : మౌంట్ డియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ కాన్వొకేషన్, కల్చరల్ ఫెస్ట్–2023 పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్ట్‌కు అకడమిక్ కోఆర్డినేటర్ వరలక్ష్మి నేతృత్వం వహించగా ముఖ్య అతిథిగా స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు. ముందుగా అధ్యాపకుల ఆధ్వర్యంలో బృందం ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూనియర్ సెకండరీ విద్యార్థిని శర్వాణి నృత్య ప్రదర్శనతో అందరినీ అలరించింది. అనంతరం పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై వారి ప్రతిభను ప్రదర్శించారు. సంగీతం, పాటలు, డ్యాన్స్‌లతో అందరినీ ఉర్రూతలూగించారు. చివరిగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ విద్య వందన సమర్పణ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రాన్స్‌పోర్టు కమిషనర్



కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వి.సుందర్

గోపాలపట్నం: రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ వి.సుందర్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ మల్లికార్జునను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

జీఎస్‌టీ కమిషనర్‌కు ఏయూ డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న వెంకటేశ్వరరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి, కస్టమ్స్, జీఎస్‌టీ శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వరరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. న్యాయ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య దాసరి సూర్య ప్రకాశరావు పర్యవేక్షణలో ×విదేశీ మారక ద్రవ్యం–చట్ట విరుద్ధమైన డబ్బుతో విదేశీ బ్యాంకుల లావాదేవీలు, తీసుకోవలసిన చట్టాలు, మార్గదర్శక సూత్రాలు, అవగాహన×అంశంపై జరిపిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను వెంకటేశ్వరరావు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

దిగ్విజయంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



ప్రజాభిప్రాయ సేకరణ పత్రాలను ఆడారి ఆనంద్‌కు అందిస్తున్న రామ్మోహనరెడ్డి

సింథియా: జీవీఎంసీ 63వ వార్డులో చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శుక్రవారంతో దిగ్విజయంగా పూర్తయింది. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, యూత్ అధ్యక్షుడు సోమాదుల సురేష్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీ కొట్నాన రవి ఆధ్వర్యంలో వార్డులోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చురుగ్గా చేపట్టారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి గత ప్రభుత్వం కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా మెరుగైన పాలనను అందించిందో వివరించారు. నివాసుల అనుమతితో ఇంటి గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికిస్తూ ప్రభుత్వ సుపరిపాలనపై అభిప్రాయాలను సేకరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని ప్రజలను అభ్యర్థించారు. వార్డు ప్రజలు ఆమోదించిన పత్రాలను శుక్రవారం ఆడారి ఆనంద్ కుమార్‌కు పిలక రామ్మోహనరెడ్డి అందజేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సురాడ పెంటారావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మళ్ల ధనలతకు అండగా ఉంటాం



ధనలత యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ మళ్ల ధనలత అనారోగ్యానికి గురై శ్రీహరిపురంలోని తన ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య, యోగక్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి, త్వరగా కోలుకుని పార్టీకి సేవలందించాలని ఆడారి ఆకాంక్షించారు. ధనలతను పరామర్శించిన వారిలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, అంగ రామ్‌ప్రసాద్, మనోహర్ తదితరులు ఉన్నారు.

మూడు వాటర్ మోటార్ పంపుల ప్రారంభం



పంపులను ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు పాత చెక్‌పోస్ట్ ఏరియాలోని రిజర్వాయర్ వద్ద మూడు కొత్త వాటర్ మోటార్ పంపులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఇక్కడ 40 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన మోటార్ పంపులకు కాలం చెల్లడంతో కొండవాలు ప్రాంతాల్లోని రిజర్వాయర్లకు నీటి పంపింగ్ ఇబ్బందికరంగా మారింది. వాటర్ సప్లై ఏఈ ద్వారా సమస్య తెలుసుకున్న కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్ ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.10 లక్షలతో రిజర్వాయర్‌కు అవసరమైన మూడు కొత్త మోటార్లు కేటాయించేలా చర్యలు చేపట్టారు. వాటిని ఆడారి ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు ఇన్‌చార్జ్ రేవళ్ల సత్యనారాయణ, సంపత్‌కుమార్, ఖాన్, ఆడారి హరీష్, అంగ రామ్‌ప్రసాద్, తోనంగి వెంకటరమణియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న ఎంప్లాయిమెంట్ అధికారి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(టెక్నికల్) కె.సుధ మాట్లాడుతూ టైజియో టెక్నాలజీస్, శ్రీనిధి అసోసియేట్స్, ఆప్టెక్, ఫిన్‌కేర్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ నిప్పాన్‌లైఫ్ ఇన్సూరెన్స్, రోవర్ ఐటీ టెక్నాలజీస్, సాయి మధు ఇంజినీరింగ్ అండ్ టెక్ సర్వీసెస్, కోజెండ్ ఈ–సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 277 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూలకు 347 మంది అభ్యర్థులు హాజరవగా.. 86 మంది ఎంపికైనట్లు తెలిపారు. రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి సి.ఉమాదేవి, జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 58వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 58వ వార్డు గుల్లలపాలెం వద్ద శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పలు పథకాలను పలువురు టీడీపీ నాయకులు మెచ్చుకుంటున్నారంటే ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రస్తుతం జగన్ సర్కారు పేదలకు అందిస్తున్న పథకాలను తొలగిస్తామని చెప్పే దమ్మూ, ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు అండగా నిలిస్తే మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి మరిన్ని మంచి పనులు చేస్తారని తెలిపారు. టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, 59వ వార్డు పార్టీ అధ్యక్షుడు పుర్రె సురేష్, మాజీ కార్పొరేటర్ కన్నబాబు, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్‌లు తోనంగి వెంకటరమణి, చుక్క వరలక్ష్మి, ఆడారి హరీష్, అంగ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.